ప్రజాశక్తి

శనివారం 29 జులై 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మురుగునీటి శుద్ధి కర్మాగార

పనులు వేగవంతం

పనులను పరిశీలిస్తున్న కమిషనర్

జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నరవలో ఉన్న మురుగునీటి శుద్ధి కర్మాగారాన్ని 108 ఎంఎల్‌డితో అభివృద్ధి పరిచే పనులను వేగవంతం చేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన నగర పరిధిలోని నరవలో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి కర్మాగారం, అమృత్ పథకంలో ఎంపికైన నరవ చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరవలో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి ప్లాంట్‌కు సంబంధించి ఫేజ్-1 పనులు దాదాపు పూర్తయ్యాయని, ఫేజ్-2లో 50 శాతం పనులు అయ్యాయని తెలిపారు. ప్లాంట్ పనిచేసే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిషనర్ తిలకించి పెందుర్తి, గాజువాకల నుంచి గృహ, వాణిజ్య, పరిశ్రమల ద్వారా వచ్చే ఘన ద్రవ వ్యర్థాలను ఈ ప్లాంట్‌లో శుద్ధి చేసి మరలా ఆ నీటిని హెచ్‌పిసిఎల్, మిగతా 2లో..

ఎయు ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో కోతకు గురైన నేల

వికృత చేష్టలు.. విధ్వంసానికి పరాకాష్టలు..

ఎన్నో తరాలకు నీడనిచ్చిన ఆంధ్ర కళామతల్లి ప్రాంగణం నేడు మొక్కలేక రోధిస్తోంది. పర్యావరణానికి సాక్షీభూతమైన ఈ ప్రాంగణంలోని చక్కటి నీడనిచ్చే వృక్షాలు, నాడు కనువిందుగా కనిపించిన పచ్చిక బయళ్లు నేడు మచ్చుకైనా కానరావడం లేదు. 'ఎందుకు వీటిని కనుమరుగు చేసే వ్యూహం .. నేల తల్లిని చిదిమేసే ప్రణాళికలే అభివృద్ధా? ఇదేం తలకిందుల తర్కం ?' అంటూ మేధావులు నేటి పరిస్థితిపై గొంతు చించుకుంటున్నారు. 'అభివృద్ధి పేరుతో ఎయులో జరుగుతున్న కార్యక్రమాల వల్ల పర్యావరణానికి హాని తలపెడుతున్నారన్న ఆరోపణలపై వర్సిటీ పాలకుల వద్ద సమాధానం ఏముంది ? చెట్లను ఇష్టానుసారం నరికేసి స్థలాల పరిరక్షణా ?' అని పలువురు మండిపడుతున్నారు. నగరంలో తుపాన్లు వంటి విపత్తులను సైతం ఎదుర్కొనగలిగే మొక్కలు, మడ అడవుల సంపద విశాఖ సొంతం. అందునా ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ మైదాన ప్రాంగణం ఇందుకు ప్రత్యక్ష దర్పణం. అయితే, కొద్ది రోజుల క్రితం ఇక్కడ వృక్ష సంపదను తొలగించడంతో ఇటీవల కురిసన వర్షాలకు ఎర్రమట్టి పైకి లేచింది. నేలంతా కోతకు గురైంది. వాననీటితో ఎర్రమట్టి తేలిపోయి నేలసారం నీటితో కొట్టుకుపోయి భూమి బీటలు వారిపోయిన దుస్థితి నేడు సాక్షాత్కరిస్తోంది.

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జనం కట్టకపోతే మీరైనా కట్టండి !

- జివిఎంసి ఆర్‌పిలపై ప్రైవేట్ వ్యాపారి 'జెంఆర్' పెత్తనం
- వేధింపులు తట్టుకోలేక బాధితుల ఆందోళన బాట

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరంలోని ఓ ప్రైవేట్ వ్యాపారి జివిఎంసిలోని రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పి)లను అంటే ఒక ప్రభుత్వ వ్యవస్థను వాడుకోవడం తేటతెల్లమైంది. ఏడాదికాలంగా సాగిస్తోన్న ఈ దందా ఎట్టకేలకు వెలుగులోకి వచ్చింది.. నగర పాలక సంస్థకు చెందిన క్లస్టర్ అధికారి (సిఒ)లకు ఒక్కో రిసోర్ పర్సన్ (ఆర్‌పి) రూ.1160 చెల్లించి జెఎంఆర్ రైస్, పప్పుల కూపన్ పొందాలంటూ సదరు ప్రైవేట్ వ్యాపారి జారీచేసే హుకుంకు జివిఎంసిలో కొద్దిమంది అధికారులు జీ హుజూర్ అన్నారు. ఏడాదికాలంగా ఆర్‌పిలు మాకు వద్దు బాబోయ్ ఈ తలనొప్పి అంటూ మొరపెట్టుకుంటున్నా ప్రైవేట్ వ్యాపారి ఎలా వీరిచేత భయపెట్టి నెలనెలా .డబ్బులు కట్టించుకుని వ్యాపారం కొనసాగిస్తున్నాడన్నది ఇక్కడ ప్రశ్న. ఆర్‌పిలు చాలా మంది నగరంలోని పలు వార్డుల నుంచి పరోక్షంగా నిరసన తెలుపుతుంటే 'జనం కట్టకపోతే మీరైనా కట్టండి' లేదంటే ప్రభుత్వానికి మీ పనితీరుపై మిగతా 2లో..

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

వార్త 2లో..

పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

వార్త 2లో..

అర్బన్ ఫోకస్ పత్రిక ఆవిష్కరణ

వార్త 2లో..

మహిళల పోరుయాత్ర

మహిళలపై హింస నివారణకు నిపుణులతో కమిషన్ ఏర్పాటు చేయాలని, మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో హింసపై మహిళల పోరు యాత్ర రాష్ట్ర జాతా విశాఖ నగరంలోని ఎల్‌ఐసి కార్యాలయ దరి అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ జాతాను మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి యాత్ర ఉద్దేశాన్ని వివరించారు. అనంతరం ఈ జాతా విశాఖ నగరంలోని పలుచోట్ల మహిళలను చైతన్యపరుస్తూ సాగింది.

(వార్తలు మెయిన్, టాబ్లాయిడ్ పేజీల్లో..)

CLEAR VIEW
DIAGNOSTICS
Clarity Assured

MRI
- Open MRI With Permanent Magnets
- First time in Vizag with Fearless Technology
- Procedure with Utmost Comfort

CBCT
- Best Resolution with least Radiation
- AI technology
- Only Machine which generates the image with 75% low radiation
- 2D/3D - OPG/CBCT with one exposure

USG
- With 4D Technology
- Image of the baby can be seen like photograph
- Ultrasonography
- Colour Doppler
- Sono Mammo • 2D Echo

MAMMOGRAPHY
- Advanced to Mammography, Thermolytix with FLIR Camera
- No - Touch
- No - Pain
- No - Radiation
- AI Technology with Utmost Comfort
- Detects cancer before on set of disease.

EECP
- Best in Class Technology
- First time in Vizag
- Assured results with best Technology

Beside Green Apple Hotel, Old Gajuwaka Jn., 60 Feet Road,
Visakhapatnam-26. Cell : 7396 777 108, 8374 77 1108

మొదటి పేజీ తరువాయి..

పనులు వేగవంతం చేయండి

స్టీల్‌ప్లాంట్‌లకు వినియోగించేందుకు పంపిస్తామన్నారు. అనంతరం ముడసర్లోవ మురుగునీటి శుద్ధి కర్మాగారం వద్ద మొక్కలు నాటారు. నరవ చెరువును సందర్శించి చెరువు చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించి, చెరువుకు రక్షణ గోడ ఏర్పాటు చేయాలన్నారు. ఆకర్షణీయమైన మొక్కలతో పార్కును తీర్చిదిద్దాలన్నారు. పర్యటనలో పర్యవేక్షక ఇంజినీర్ వినయ్ కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ దిలీప్, స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్, టాటా కన్సల్టింగ్ మెంబర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

జనం కట్టకపోతే మీరైనా కట్టండి !

ఫిర్యాదులు చేసి ఉద్యోగాలు ఊడగొడతామంటూ బెదిరింపులకు సైతం జెఎంఆర్ బియ్యం, పప్పులు, ఉప్పులు, నూనెల వ్యాపారి పెత్తనం చేస్తూ వస్తున్నాడు. తాజాగా ఓ ఆర్‌పి తన ఆవేదనను సిపిఎం నాయకురాలు పి.మణికి వాయిస్ మెసేజీ పంపించారు. 'మాకు వార్నింగులు ఇస్తున్నారు మేడం. వార్డుల్లో వందల సంఖ్యలో ఆర్‌పిలు జివిఎంసి పరిధిలో పనిచేస్తున్నారు. మీరు కట్టకపోతే బయట జనంతో కట్టించండి. రూ.1160 వారి తరపున మీరు చెల్లించండి. లేదంటే జోనల్ ఆఫీసుకు పిలిపించి పంచాయతీ ఎడతాం' అంటూ బెదిరిస్తున్నారు. రక్షించండి మేడమ్' అన్నది ఈ మెసేజ్ సారాంశం. ఇలా మణికి పలు వాయిస్ మెసేజ్‌లు ఆర్‌పిల నుంచి వచ్చాయి. తాజాగా నగరంలోని 3 వార్డులకు చెందిన రిసోర్స్ పర్సన్స్ 15 మంది ఒక్కొక్కరూ రూ.1160 చొప్పున జెఎంఆర్ వ్యాపారికి చెల్లించి కార్డులు పొందారు. ఈ కార్డు పొందిన వారు నెలనెలా సరుకులు తక్కువకే కొనుగోలు చేయొచ్చంటూ జెఎంఆర్ కరపత్రంలో ప్రచురించి పంపిణీ చేసింది. ఆర్‌పిలకు వార్నింగ్‌లిస్తూ ఏడాది కాలంగా ఇలా పబ్బం గడుపుకుంటున్నాడు జెఎంఆర్ వ్యాపారి. ఈ నేపథ్యంలో డబ్బులెవరూ కట్టొద్దంటూ సిపిఎం నేతలు ఆర్‌పిలకు పిలుపునిచ్చారు. సోమవారం జరిగే కలెక్టరేట్, జివిఎంసి గ్రీవెన్స్ సెల్‌కు నేరుగా ఆర్‌పిలను తీసుకెళ్లి బాధ్యులైన దోషులపై చర్యలకు సిపిఎం డిమాండ్ చేయనుంది.

నా దృష్టికి సమస్య రాగానే చెక్ పెట్టాను : జివిఎంసి యుసిడి పీడీ పాపునాయుడు

ఆర్‌పిలపై జెఎంఆర్ వ్యాపారి ఆర్థిక వేధింపులపై నగరపాలక సంస్థ ఉన్నతాధికారి పాపునాయుడును ప్రజాశక్తి శుక్రవారం సాయంత్రం వివరణ కోరగా తన దృష్టికి ఈ విషయం తెలియగానే చెక్ పెట్టి ఎవ్వరినీ కట్టొద్దని చెప్పానని, జెఎంఆర్‌కు డబ్బులు చెల్లించాలని తాను ఎలాంటి డైరెక్షన్ ఆర్‌పిలకు ఇంతవరకూ ఇవ్వలేదని, తన ప్రమేయం దీంట్లో లేదని తెలిపారు.

30న చిత్ర కళా ప్రదర్శన, చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కళా సంస్కృతిని పెంపొందించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో గతంలో కళాయజ్ఞ పోటీల్లో పాల్గొన్న 25 మంది చిత్రకారుల నుంచి ఒక్కొక్కరివీ మూడు చిత్రాల చొప్పున ఎంపిక చేసి జీవన రేఖలు అనే టైటిల్‌తో ఈ నెల 30న డాబాగార్డెన్స్‌లోగల అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో చిత్రకళా ప్రదర్శన, చిన్నారులకు చిత్రలేఖన పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు అల్లూరి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ జిఎస్.రాజేశ్వరరావు తెలిపారు. శుక్రవారం విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9:30 గంటలకు ఆంధ్రా యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ ప్రొఫెసర్ శిష్టా శ్రీనివాస్ ఈ కార్యక్రమాలను ప్రారంభిస్తారని, ప్రముఖ చిత్రకారులు శేషబ్రహ్మం, చిత్రకళా పరిషత్ ప్రధాన కార్యదర్శి సుంకర చలపతిరావు, ప్రముఖ యువ కవి, మన హీరోలు రచయిత సుబ్బు ఆర్వీ, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ జిఎస్.రాజేశ్వరరావులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేటి తరం చిన్నారులు చిత్రకళ పొన్నత్యాన్ని తెలియపరచి, వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు 1 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ప్రవేశ రుసుము లేకుండా చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 4:30 గంటలకు చిత్రకళా ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు, ఆర్ట్ కాంటెస్ట్‌లో విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేయనున్నామన్నారు. ఉదయం 10 గంటలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరమా - శాపమా అన్న అంశంపై సదస్సు జరుగుతుందన్నారు. ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాజేశ్వరరావు

'బర్గర్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హర్రర్ అండ్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన బర్గర్ మూవీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం లాసన్స్ బే కాలనీ ఉన్న వైజాగ్ ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ - స్టూడియోస్‌లో శుక్రవారం జరిగింది. అతిథులుగా హాజరైన విటివి చైర్మన్, నిర్మాత, కార్మిక నాయకుడు వివి.వామనరావు మాట్లాడుతూ ఈ రోజుల్లో కథ కథనం బాగుంటే చూసే జనం బాగా పెరిగారని అందుకు ఉదాహరణ ఇటీవల విడుదలైన 'బలగం', 'సామజవరగమన' వంటి చిత్రాలేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు, స్టూడియో ఆర్కె గురు ఎంటర్‌టైన్మెంట్స్ అధినేత రాకేష్ రెడ్డి, ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం, హీరో వీరేష్ బాబు, హీరోయిన్ రేఖాభోజ్, బాదంగిర్ సాయి పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ సమీపంలో సుమారు 600 కోట్ల రూపాయలతో నిర్మించనున్న రహేజా గ్రూపునకు చెందిన ఇనార్బిట్ మాల్‌కు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వచ్చే నెల ఒకటో తేదీన శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లును రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సుమారు 17 ఎకరాలలో నిర్మించనున్న ఈ ఇనార్బిట్ మాల్ రెండు తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదని చెప్పారు. అందులో సుమారు 200కు పైగా మాల్స్ ఉంటాయని, దీనికి అవసరమైన ప్రభుత్వ అనుమతులన్నీ ఇప్పటికే రహేజా యాజమాన్యం తీసుకుందని చెప్పారు. ఈ మాల్ లో సుమారు 5 వేల మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి వెల్లడించారు. 24 నెలల్లో ఈ మాల్ నిర్మాణం పూర్తవుతుందని తెలియజేశారు. ఈ మాల్ అందుబాటులోకి వస్తే ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బెంగాల్ తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకులను కూడా ఆకర్షిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే ఇదే ఆవరణలో ఒక ఐటి టవర్‌ను కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రహేజా గ్రూపును కోరారని తెలిపారు. విశాఖను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో జగన్మోహన్ రెడ్డి ఉన్నారని తెలియజేశారు. ఇదిలా ఉండగా అదే రోజున జివిఎంసికి చెందిన సుమారు రూ.138 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. ఆయన వెంట వైసిపి ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి కెకె.రాజు, డిసిసిబి చైర్మన్ కోలా గురువులు, కార్పొరేటర్లు బాణాల శ్రీను, హనూక్ ఉన్నారు.

ఏర్పాట్లు వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి అమర్‌నాథ్

అర్బన్ ఫోకస్ పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పట్టణ పౌర సమాఖ్య, పట్టణ పౌర సంఘాల తరుపున వార్వా, నివాస్ రూపొందించిన 'అర్బన్ ఫోకస్' తొలి సంచికను శుక్రవారం మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్‌గా వార్వా, నివాస్ చేస్తున్న కృషిని అభినందించారు. ఎన్నికయిన ప్రజా ప్రతినిధులు ఉండి కూడా ప్రజల బాధలను అర్థం చేసుకోకుండా, ప్రజలపై మోయలేని భారాలను మోపుతూ చట్టసభల్లో నిర్ణయాలు చేస్తున్నారన్నారు. ప్రజాభిప్రాయాన్ని లెక్క చెయ్యకుండా నిర్ణయాలు చేసే హక్కు ఎవరికి లేదన్నారు. ఆస్తి పన్ను తీరును అందుకు ఉదహరించారు. ఇలాంటి విషయాలను ప్రజలకు చేర్చడంలో అర్బన్ ఫోకస్ చాలా ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఫోకస్ ఎడిటర్ ఆర్.గణేష్ కుమార్, వార్వా అధ్యక్షులు ఎన్.ప్రకాశరావు, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్ట నారాయణమూర్తి, జివి.రమణ, కె.మోహనరావు పాల్గొన్నారు.

సంచికను ఆవిష్కరిస్తున్న ఇఎఎస్.శర్మ

జోగి రమేష్ వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జోగి రమేష్‌ను మంత్రివర్గం నుంచి తక్షణం తొలగించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. టిడిపి అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేష్‌పై మంత్రి జోగి రమేష్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం సైకో అవడంతో మిగతా మంత్రులు కూడా సైకోలా మారుతున్నారని విమర్శించారు. జోగి రమేష్ మాటలు బిసిల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ మాట్లాడుతూ వైసిపికి రోజులు దగ్గర పడ్డాయని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ కోరాడ రాజాబాబు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ చిక్కాల విజయ్ బాబు, రాష్ట్ర కార్యదర్శులు బొండా జగన్, గంటా నూకరాజు, లోడగల కృష్ణ, గొలగాని వీరారావు పాల్గొన్నారు.

పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం

ఐక్య పోరాటాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ స్పష్టం చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 897వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్ ఇన్స్ట్రుమెంటేషన్, క్యుటిడి, ఆర్ఇడి, టెలికాం, డిఎన్‌డబ్ల్యు విభాగాల ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థలను ఎలా నిర్వీర్యం చేస్తోందో వివరించారు. విశాఖ ఉక్కును దెబ్బతీసేందుకు సొంత ఇనుప గనులు కేటాయించకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఉంటేనే రిజర్వేషన్లు అమలవుతాయని అన్నారు. ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపికి రానున్న కాలంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు పాటుపడే పార్టీలను వచ్చే ఎన్నికల్లో ప్రజలు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్, తదితరులు పాల్గొన్నారు. ఐద్వా నాయకులు, కార్యకర్తలు ఈ దీక్షలకు సంఘీభావం ప్రకటించారు.

దీక్షల్లో కూర్చున్న హెచ్ఎంఎస్ నాయకులు

కలెక్టరేట్ : విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయించాలని స్టీల్‌ప్లాంట్ హెచ్ఎంఎస్ యూనియన్ అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 848వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్ఎంఎస్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో శాశ్వత ప్రాతిపదికన తక్షణమే ఉద్యోగుల నియమకాం జరపాలన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించాలన్నారు. స్టీల్ సిఐటియు కార్యదర్శి వనము అప్పలరాజు మాట్లాడుతూ బదులుగ బతుకులు బాగు కోసం పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిరక్షణకు తమ ప్రాణాలను సైతం ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దీక్షల్లో గొందేశి రమణారెడ్డి, అప్పలరాజు, అప్పారావు, కనక రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి
పర్యవేక్షణ కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి- సీతమ్మధార: రాష్ట్రంలో కుండపోత వర్షాలు దష్ట్యా, విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారానికి జిల్లా కేంద్రాల్లో పర్యవేక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. జిల్లా కేంద్రాలలోని సూపరింటెండెంట్ ఇంజనీరు కార్యాలయంలో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ నియంత్రణలో రౌండ్ ది క్లాక్ పనిచేసేలా ఈ పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నెంబర్ 1912 ఉందని, దానికి అదనంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తుపాను లేదా అధిక వర్షాల వలన విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, విద్యుత్ లైన్ల సమస్యల పరిష్కారానికి కింది ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ సర్కిల్, ఎస్ఇ ఏలూరు (9440812702), ఎస్ఇ రాజమహేంద్రవరం (9440812583), ఎస్ఇ విశాఖపట్నం (9440812487), ఎస్ఇ విజయనగరం (9440812447), ఎస్ఇ, శ్రీకాకుళం (9440812386) నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ప్రవేశాలకు
31లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఆరిలోవ: 2023-24 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఒపెన్ స్కూల్) ద్వారా పదవ తరగతి , ఇంటర్ ప్రవేశాలకు ఆగస్టు 31 వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిని ఎల్.చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31లోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. www.apopen-school.ap.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు అభ్యర్థులు నమోదు చేసుకొని, దగ్గరలో ఉన్న ఓపెన్ స్కూల్ సెంటరుకు వెళ్లి, ఒరిజనల్ సర్టిఫికెట్లు సమర్పించి ఫీజు చెల్లించి ప్రవేశం పొందవచ్చన్నారు.

బావులలో గంబూషియా చేపల విడుదల

ప్రజాశక్తి -ములగాడ: డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా ఇతర సీజనల్ వ్యాధులకు కారణమైన దోమలు, వాటి లార్వాలను నియంత్రించే చర్యల్లో భాగంగా శుక్రవారం 40వ వార్డు ఎకెసి కాలనీలోని పలు మంచినీటి బావులలో గంబూషియా చేపలను విడుదల చేశారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు (జీవిఎంసి) వీటిని విడుదల చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం డ్రైడే‌ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మల్కాపురం ఏరియా మలేరియా ఇన్స్పెక్టర్ డి రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ రోమాల వేణుబాబు, మలేరియా సూపర్‌వైజర్లు వి విజయకుమారి, దుల్లా శ్రీనివాసరావు, శానిటరీ సెక్రటరీ సత్తిబాబు, మేస్త్రి శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు పావని, నాగమణి, వార్డు వైసిపి అధ్యక్షులు వరపల మహేష్ పాల్గొన్నారు

జిఒ ప్రకారం జీతాలు చెల్లించాలని
రైల్వే కాంట్రాక్టు కార్మికుల ధర్నా

డిఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైల్వే కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి - గాజువాక : వడ్లపూడి రైల్వే రిపేర్ స్పేర్ పార్ట్స్ కార్మికులకు జిఒ ప్రకారం జీతాలు చెల్లించాలని రైల్వే కౌంటర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వివిఎల్.నరసింహం డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం వడ్లపూడి రైల్వే రిపేర్ మెయిన్ గేటు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు చట్టాలు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వడ్లపూడి రైల్వే స్పేర్ పార్ట్స్ కార్మికులతో రోజుకు 12 గంటలు పనిచేయించుకుంటూ, వారి సమస్యలు పరిష్కరించడం, సౌకర్యాల కల్పనలో యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు.

రైల్వే స్పేర్ పార్ట్స్ రిపేర్ కంపెనీ కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కంపెనీ యాజమాన్యానికి ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. జిఒ ప్రకారం వేతనాలు, ఇతర సౌకర్యాలతోపాటు ఎ,బి షిఫ్టుల్లో పనిచేసే కార్మికులకు భోజన సదుపాయ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు గాజువాక జోన్ ప్రధానకార్యదర్శి ఎ.లోకేష్, అధ్యక్షులు డి రమణ, యూనియన్ నేతలు ఎ.అవతారం, రాజు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : రైల్వే కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైల్వే డిఆర్ఎం కార్యాలయం వద్ద ఈస్ట్ కోస్ట్ రైల్వే కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ విశాఖ జిల్లా కార్యదర్శి ఒ.అప్పారావు మాట్లాడారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.జగన్, నాయకులు నాగమూర్తి, కృష్ణ, పాపారావు, సిఐటియు నాయకులు జి.అప్పలరాజు, బి.సింహాచలం పాల్గొన్నారు.

గులాబీ కండ్ల కలకపై అప్రమత్తత అవసరం

డాక్టర్ మురళీధర్ రామప్ప

ప్రజాశక్తి - ఆరిలోవ : దేశవ్యాప్తంగా వ్యాపించే గులాబీ కండ్లకలకతో అప్రమత్తంగా ఉండాలని, అవి తేలికగా ఒకరినుంచి మరొకరికి వ్యాప్తి చెందుతాయని, సకాలంలో వైద్య సంరక్షణ అవసరమని ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్యవిజ్ఞాన సంస్థ, కార్నియా కన్సల్టెంట్ డాక్టర్ మురళీధర్ రామప్ప అన్నారు. ఫ్లూ కారణంగా సాధారణంగా వర్షాకాలంలో వచ్చే గులాబిరంగు కన్ను అనబడే కండ్ల కలక కేసులు దేశవ్యాప్తంగా పెరుగుతున్నా యన్నారు. ఒక ప్రత్యేక వైరస్‌ల సమూహం కారణంగా వచ్చే ఫోలిక్యులర్ కండ్లకలక ఈ కాలంలో అత్యంత సాధారణంగా వస్తుందన్నారు. ఫోలిక్యులర్ కండ్ల కలక అసౌకర్యంగా ఉంటుందని, ఇది సాధారణంగా దృష్టికి హాని కలిగించదన్నారు. అయినప్పటికీ ప్రతి క్రియలను నివారించడానికి సమయానుకూల చికిత్స, సరైన సంరక్షణ కీలకమన్నారు. ఇది అన్ని వయస్సుల వారికి ప్రభావితం చేయగలదన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఇవి హాని కలిగించవచ్చన్నారు. కండ్ల కలక లక్షణాలు అనిపిస్తే, వాటిని నివారించేందుకు వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు. విచక్షణ రహితంగా యాంటిబయాటిక్స్, స్టెరాయిడ్స్ వినియోగాన్ని నివారించాలని సూచించారు.

అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థులు నితీష్, మణికంఠ

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం రామకృష్ణ నగర్ ప్రాంతానికి చెందిన పదవ తరగతి విద్యార్థులు మాసినాడ నితీష్, పాండవ మణికంఠ అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఆగస్టు ఒకటి నుంచి ఆరవ తేదీ వరకు దుబాయిలో జరగనున్న పోటీల్లో వీరిద్దరూ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని కోచ్ చిట్టిబాబు, మణికంఠ తల్లిదండ్రులు పాండవ శోభ, ఈశ్వరరావు తెలిపారు.ఇటీవల మే నెల 26 నుంచి 28వరకు ఢిల్లీలో భారతీయ స్కైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -17 పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా దుబాయ్ మల్టీపుల్ గేమ్స్-2023 పోటీలకు వీరిని ఎంపిక చేశారని నితీష్ తల్లిదండ్రులు త్రినాథ్ సుమధుర తెలిపారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు.

ఇనాం భూముల రిజిస్ట్రేషన్‌లో అక్రమ వసూళ్లు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఇనాం భూముల పట్టాల రిజిస్ట్రేషన్‌కు సచివాలయాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు విమర్శించారు. సిపిఎం పోరాటంతో గత టిడిపి ప్రభుత్వం స్పందించి జిఒ 301చ 388జారీ చేసిందని గజాల్లోపు ఉచితంగా, 200గజాలు దాటిన వారికి కొంత సొమ్ము చెల్లిస్తే పట్టాలు మంజూరు చేసిందన్నారు. అయితే అప్పట్లో వాటికి రిజిస్ట్రేషన్, ఇతర సౌకర్యాలను కల్పించలేదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎట్టకేలకు గతంలో ఇచ్చిన పట్టాలకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించి, అప్పట్లో పట్టాలకు చెల్లించిన మొత్తంలో ఏడున్నర శాతం, లేదా రూ.500చెల్లింపుతో రిజిస్ట్రేషన్ చేస్తామని ప్రకటించిందన్నారు దీంతో ఆయా సచివాలయాలకు సంబంధిత లబ్ధిదారులు రిజిస్ట్రేషన్‌కు వెళితే చలానా సొమ్ముతోపాటు అదనంగా రూ.250 నుంచి రూ.500వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కొంత నగదు ఇవ్వాల్సి ఉంటుందనిబిసి రోడ్డులోని ఒక సచివాలయ అడ్మిన్ సమర్థించుకోవడం దుర్మార్గమన్నారు. దీనిపై అధికారులు స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ప్రాంతంలోని ప్రయివేటు పాఠశాలల సమస్యలపై కొత్తగా విధుల్లో చేరిన గాజువాక, పెదగంట్యాడ ఎంఇఒలకు జిప్సా ప్రతినిధులు శుక్రవారం విన్నవించారు. గాజువాక ఎంఇఒ ఎం.సునీత, విశ్వనాథం, పెదగంట్యాడ ఎంఇఒ రమణాజీ, శ్రీనివాస్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను ఇచ్చి అభినందించారు. అనంతరం ప్రైవేటు పాఠశాలల రెన్యువల్, ఆన్‌లైన్ ప్రక్రియ వంటిఅంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాసరావు,సభ్యులు మురళి, మౌళి, రాము, నాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు టీచర్స్ ఎన్‌రిచ్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - ఆరిలోవ : జిల్లా విద్యాశాఖాధికారి సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల సంఘం(అప్సా) ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఎన్ఎడి జంక్షన్ దరి రామకృష్ణ స్కూల్‌లో టీచర్స్ ఎన్‌రిచ్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అప్సా రాష్ట్ర కోశాధికారి ఎం.వి.రావు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన అన్ని సబ్జెక్టుల రిసోర్స్ పర్సన్ పాల్గొని, సందేహాలను నివృత్తి చేస్తారని, జిల్లాలోని ప్రయివేట్ స్కూల్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీమా తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 65 వ వార్డు, సంజీవిగిరి కాలనీ సచివాలయ పరిధిలో ఇటీవల మరణించిన కొత్తపు అమ్మాజీ కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణసాయం కింద రూ.పది వేలను .ఆమె కుమారుడు గవరయ్యకు వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు శనివారం అందజేశారు. వైఎస్ఆర్ బీమా పరిహారం రూ.లక్షలో మిగతా మొత్తాన్ని నామినీ అకౌంట్‌లో తర్వాత జమచేస్తారన్నారు.కార్యక్రమంలో జన సతీశ్, కెఇ మాస్టర్ పాల్గొన్నారు.

ఏకరూప పౌరస్మృతి అసాధ్యం

ప్రజా సంఘాల
రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేత

ప్రజాశక్తి- సీతమ్మధార : భిన్న సంస్కృతులు కలిగిన మన దేశంలో ఏకరూప పౌరస్మృతి అమలు ఎలా సాధ్యమని పలు దళిత, బహుజన సంఘాల నేతలు ప్రశ్నించారు. శుక్రవారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జెవి.ప్రభాకర్ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ, డిహెచ్‌పిఎస్, కెవిపిఎస్, ఇతర దళిత సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నేతలు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం అనేక సంస్కృతులు, సంప్రదాయాలు, లౌకికవాదం, మతస్వేచ్ఛకు రక్షణ కల్పిస్తే, దానికి భిన్నంగా బిజెపి మనువాద సిద్ధాంతాన్ని తీసుకొచ్చి ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. మైనార్టీలు వ్యతిరేకంగా మెజార్టీ ప్రజలను అనుకూలంగా మార్చుకోవడం కోసమే బిజెపి యుసిసి అమలు వంటి విధానాలను కొనసాగిస్తోందన్నారు. యూనిఫాం సివిల్ కోడ్ సాధ్యం కాదని21వ లా కమిషన్ చెప్పినప్పటికీ, 22వ లా కమిషన్ ద్వారా ఎందుకు చర్చిస్తున్నారని మండిపడ్డారు. మణిపూర్‌లో మరణహోమానికి బిజెపి దాని అనుబంధ మనువాద సంస్థలే కారణమన్నారు. మణిపూర్‌లో ఆదివాసీలు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. యూనిఫామ్ సివిల్ కోడ్ అమలునిర్ణయాన్ని మార్చుకోవాలని, మణిపూర్ మారణకాండపై ప్రధాని ప్రకటన చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, టి.కాంతారావు, బిసి సంఘం నేతలు వేగి బాబురావు, మల్లేశ్వరరావు, న్యాయవాదులు గిరిధర్, పాకా సత్యనారాయణ, మాజీ ఎఎస్‌పి ప్రకాశరావు, క్రైస్తవ సంఘం నేతలు కె.సత్యశీలరావు, సిపిఎం నేత కృష్ణారావు, సిపిఐ నేతలు చంద్రశేఖర్, ఆర్.చిరంజీవి, సుబ్బన్న, కెవిపిఎస్ నేత డాక్టర్ బి.మోహన్‌బాబు, ఎయు సూకరాజు సమాజం, గోవిందరాజులు, యుసిసిఐ విసి కె.జార్జి బంగారి, ఎఐడిఆర్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాటూరి శ్రీనివాసరావు, బిఎస్ఐ మల్లయ్య రాజు, దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, డిహెచ్‌పిఎస్ నేతలు గుడాల రాంబాబు, మండే సత్యనారాయణ, బహుజన కళామండలి ఉదయ్ భాస్కర్ మాట్లాడారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి దినపత్రిక
ఉద్యోగ అవకాశాలు

విశాఖపట్నం కేంద్రంలో మార్కెటింగ్ విభాగాల్లో పని చేయుటకు ఉద్యోగాలు ఉన్నాయి.
ఆసక్తిగలవారు మా కార్యాలయానికి వచ్చి సంప్రదించగలరు.

1. గాజువాక డివిజన్ కో-ఆర్డినేటర్ (మార్కెటింగ్)
2. జాబ్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ (ప్రింటింగ్ వర్క్)
3. హెల్పర్స్ (ప్రింటింగ్ సెక్షన్)

- మొదటి ఉద్యోగానికి ఇతర పత్రికలలో మార్కెటింగ్‌లో అనుభవం ఉండాలి. టీంని లీడ్ చేసే సామర్థ్యం ఉండాలి
- 2వ ఉద్యోగానికి ప్రింటింగ్ వర్క్ ఆర్డర్లు బుక్ చేసే అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
- 3వ ఉద్యోగానికి 10వ తరగతి/ఐ.టి.ఐ లేదా ప్రింటింగ్ సెక్షన్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099125, 9490099133

ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం : ప్లాట్ నెం.3, 'జి' బ్లాక్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఆటోనగర్, విశాఖపట్నం-46

ఇఎస్ఐ సమస్య పరిష్కరించాలని

హెచ్ఒడి కార్యాలయాల దిగ్బంధం

మాట్లాడుతున్న సిఐటియు నేత శ్రీనివాస్

ప్రజాశక్తి-ఉక్కునగరం : కాంట్రాక్టు కార్మికుల ఇఎస్ఐ సమస్యను పరిష్కరించి, కాంట్రాక్టర్లు నిలిపేసిన రూ.2,400 వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు, కెఎం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం సమస్య పరిష్కారానికి కోరుతూఅఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎస్ఎంఎస్ 1,2, ఎస్ఎంఎస్ విభాగాల హెచ్ఒడి కార్యాలయాలను దిగ్బంధం చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉక్కు యాజమాన్యం చొరవ చూపి, సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బోనస్, ఇఎస్ఐ సీలింగ్‌ను రూ.21వేలకు పెంచకపోవడం వల్ల ఉత్పత్తిలో కీలక భూమిక పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులు హక్కులను కోల్పోయి నష్టపోతున్నారన్నారు కార్యక్రమంలో నాయకులు. కెపి సుబ్రహ్మణ్యం, వి వరహాలు, బి కన్నబాబు, కృష్ణ, పి మసేను, నందికి తాతారావు, చట్టి నర్సింగరావు, రమణమూర్తి, వంశీ, మురళీకృష్ణ, కోన రమణ, నాగరాజు, కె శ్రీను, ఎ అప్పారావు, శశి, స్వామి కెపి నాయుడు పాల్గొన్నారు. అనంతరం హెచ్ఒడిలకు వినతిపత్రం అందజేశారు.

సంప్రదింపుల పేరుతో కాలయాపన

నిరవధిక దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : నిర్వాసిత కార్మికుల సమస్యల పరిష్కారంలో సంప్రదింపుల పేరుతో అదానీ గంగవరం పోర్ట్ యాజమాన్యం కాలయాపన చేస్తోందని గంగవరం పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధానకార్యదర్శి నొల్లి తాతారావు మండిపడ్డారు. తమ డిమాండ్లను నెరవేర్చడంలో పోర్టు యాజమాన్యం మొండివైఖరికి నిరసనా కార్మికులు చేపడుతున్న దీక్షలు శుక్రవారానికి 25వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ పోర్టు కోసం సర్వస్వాన్ని ధారాదత్తం చేసిన నిర్వాసిత కార్మికులు వేతన పెంపుపై ఆందోళన చేస్తుంటే యాజమాన్యం సానుకూలంగా స్పందించకపోగా, సంప్రదింపుల పేరుతో జాప్యం చేయడం దుర్మార్గమన్నారు.తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించ లేకుంటే, తామిచ్చిన భూములు, ఆస్తులను వాపసు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ, లొల్లి స్వామి, పేర్ల నూకరాజు పాల్గొన్నారు..

1లోగా కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లాలో వైద్యఆరోగ్యశాఖలో వివిధ పోస్టులు ఏడాది కాలపరిమితికి కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగ నియామకాలకు ఆగష్టు ఒకటిలోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి జగదీశ్వరరావు తెలిపారు. డాట్స్, టిబి, హెచ్ఐవి సూపర్‌వైజర్, పిపిఎం కోఆర్డినేటర్, టిబి.హెల్త్ విజిటర్, అకౌంటెంట్, డెంటల్ మెడికల్ ఆఫీసర్స్, ఐసిటిసి కౌన్సెలర్, ఎఆర్టి కౌన్సెలర్, ఎఆర్టి డేటా మేనేజర్, ఐసిటిసి ల్యాబ్ టెక్నీషియన్, బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్, డేటా మేనేజర్ , స్టాఫ్‌నర్స్ పోస్టులకు www.visakhapatnam.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు లభిస్తాయన్నారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఆగస్టు ఒకటోతేదీ సాయంత్రం 5 గంటల లోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో పనిచేసే దినాల్లో అందజేయాలని సూచించారు. మెరిట్ ఆధారంగా నియామకాలను చేపడతామన్నారు.

మహిళలపై హింస అరికట్టడంలో విఫలం

పోరుయాత్రలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి ... ఆకట్టుకున్న కళాప్రదర్శనలు

ప్రజాశక్తి -ములగాడ :చట్టాలు చేసినా, వాటి పకడ్బందీ అమలులో నిర్లక్ష్యం వల్లే దేశంలోనూ. రాష్ట్రంలోనూ మహిళలపై హింసను అరికట్టడంతో ప్రభుత్వాలు విఫలం చెందాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఐద్వా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మల్కాపురం జోన్ 58వ వార్డు గుల్లలపాలెంలో మహిళల పోరుయాత్ర సభ జరిగింది. ఈసందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి మాట్లాడుతూ మత్తుపానీయాలు, మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా దొరుకుతుండడం కూడా తాజా పరిణామాలకు ఒక కారణమన్నారు. నిందితులను దిశ చట్టం, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించి, కఠినంగా శిక్షిస్తే కొంతమేర వీరికి అడ్డుకట్టు పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ప్రశాంతంగా ఉండే విశాఖ నగరంలోనూ ఏదోఒక మూల బాలికలు, మహిళలపై వేధింపులు, అత్యాచార ఘటనలు

ఉక్కు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఐద్వా నేత ప్రభావతి

మల్కాపురంలో ఆకట్టుకున్న కళాప్రదర్శనలు

చోటుచేసుకుంటున్నాయని, వీటిని నివారించే చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టు 8న విజయవాడలో జరిగే సభలో పెద్దఎత్తున మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఐద్వా మల్కాపురం జోన్ అధ్యక్షులు బి.మమత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.పద్మ ,వై.సత్యవతి ,రాష్ట్ర నాయకులు ప్రియాంక, పూర్ణిమ, రమణి వై.కళ్యాణి, జయలక్ష్మి , నిర్మల, వెంకటరత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలపై హింసను అరికట్టాలంటూ నిర్వహించిన కళా ప్రదర్శన ఆకట్టుకుంది.

ఉక్కు కార్మికుల పోరాటానికి సంఘీభావం

ఉక్కునగరం : మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఐద్వా ఆధ్వర్యాన చేపడుతున్న మహిళల పోరుయాత్ర శుక్రవారం మల్కాపురం నుంచి కూర్మన్నపాలెంలోని ఉక్కు పోరాట దీక్ష శిబిరం వద్దకు చేరుకుంది. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేపడుతున్న దీక్షలకు ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, ఇతర నేతలు సంఘీభావం తెలిపారు.

వేధింపుల ఎంఇఒపై చర్యల్లో నిర్లక్ష్యం

ఆర్‌జెడి కార్యాలయం వద్ద యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి- మధురవాడ : కొత్తవలస మండల విద్యాశాఖ కార్యాలయంలో సర్వీస్ రిజిస్టర్ పోయిందని చెప్పిన ఉపాధ్యాయుడు ఇ.సోల్‌రాజును వేధించడంతో, తప్పుడు ఫిర్యాదులు చేసిన ఎంఇఒపై చర్యల్లో నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమని యుటిఎఫ్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మధురవాడ ఆర్‌జెడి కార్యాలయం వద్ద యుటిఎఫ్, విజయనగరం జిల్లాశాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల విచారణలో తొమ్మిది అంశాలకుగాను ఐదింటిలో పూర్తిగాను, ఒకదాంట్లో పాక్షికంగా ఎంఇఒ తప్పు చేశారని నిర్ధారించినప్పటికీ, నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకోవడం సిసిఎ నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించనందువల్లే ఆర్‌జెడి కార్యాలయం వద్ద ధర్నా చేశామన్నారు. ఆర్‌జెడి వచ్చి చర్యలపై స్పష్టత ఇచ్చేంతవరకు దీక్ష విరమించేది లేదని భీష్మించారు.

.అనంతరం ధర్నా శిబిరానికి ఆర్‌జెడి కార్యాలయం ఇన్‌ఛార్జి ఎడి శ్రీరామమూర్తి వచ్చి, కొత్తవలస ఎంఇఒపై

ఎడికి వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

వచ్చిన ఫోర్జరీ సంతకం, ఇతరత్రా అభియోగాలు, ఉపాధ్యాయుడిని వేధించడం వంటి చర్యలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, విజయనగరం, అనకాపల్లి, విశాఖ జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఈశ్వరరావు, జి.చిన్నబ్బాయి, టిఆర్ అంబేద్కర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె విజయగౌరి, డి రాము, రాష్ట్ర కౌన్సిలర్ కె అప్పారావు, జిల్లా కార్యదర్శులు కె ప్రసాదరావు, పి త్రినాద్, పి జనార్దనరావు, తిరుపతినాయుడు, జివి రమణ, సిపిఎస్ జిల్లా కన్వీనర్ పి రాంప్రసాద్, పలు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు

అగనంపూడి ఏరియా ఆసుపత్రికి

ఆక్సిజన్ కంప్రెసర్ నెబలైజర్స్ వితరణ

డాక్టర్లకు ఆక్సిజన్ కంప్రెసర్స్‌ను ఇస్తున్న రమణారెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : అగనంపూడి ఏరియా ఆసుపత్రికి పిబిఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పులి వెంకటరమణారెడ్డి రూ.20వేలు విలువగల ఆక్సిజన్ కంప్రెసర్ నెబలైజర్స్‌ను శుక్రవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నిర్వాసితుల సంఘం అధ్యక్షులు పులి భూలోకరెడ్డి పేరిట 2021లో స్థాపించిన పిబిఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్యశిబిరాలు, పేదలకు నిత్యావసరాల పంపిణీ, యువతకు క్రీడాకిట్లు అందజేత వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆసుపత్రిలో రోగులకు ఉపయోగకరంగా ఉంటుందన్న సంకల్పంతో ఆక్సిజన్ కంప్రెసర్ నెబలైజర్స్‌ను సమకూర్చినట్లు తెలిపారు.

అనకాపల్లి ఏరియా ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ, పిబిఆర్ ట్రస్ట్ ఇచ్చిన ఆక్సిజన్ కంప్రెసర్ నెబలైజర్స్ శ్వాససంబంధిత సమస్యతో బాధపడుతున్న రోగులకు ముఖ్యంగాచిన్న పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి నేత నెల్లి శ్రీనివాసరావు, దొమ్మేటి అప్పారావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

280 మందికి టిడ్కో పట్టాల పంపిణీ

పట్టాలు పంపిణీ చేస్తున్న కెకె.రాజు, సిపిఎం నేత గంగారావు

సీతమ్మధార : 45వ వార్డు ఎస్ఆర్ నగర్‌లో 280 మంది టిడ్కో లబ్ధిదారులకు రాష్ట్రమంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు పట్టాలను పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, 45వ వార్డు వైసిపిఅధ్యక్షులు పైడి రమణ, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, బాణాల శ్రీనివాసరావు,కంటిపాము కామేశ్వరి, జోనల్ కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ, యుసిడి పీడీ పాపునాయుడు, ఎపిడి పద్మావతి, వైసిపి నేతలు హరిపట్నాయక్,ఆది లక్ష్మీ, నాయుడు, నేపాల్ శ్రీను, సన్నీ, బాబూరావు, రాజు, దుర్గా, గణపతి, మాతీను, మహేష్, సతీష్, గౌరీష్ పాల్గొన్నారు.

44వ వార్డులో గడపగడపకూ...

సీతమ్మధార : జివిఎంసి44వ వార్డు శ్రీనివాసనగర్-1, రామచంద్రనగర్ ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాయుడు శ్రీను, నూకరాజు, 44వ వార్డు నాయకులు హబీబ్, హీర, మాదాస్య గోపి, వెంకటరావు, వాసు, గోపి, సీతారాం,రెడ్డి, ప్రసాద్, బషీర్, బేగం, హరిపట్నాయక్, యం.సునీల్, రమణమ్మ, కె. చిన్న, జక్కంపూడి సత్తిబాబు, పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా దుకాణాల తొలగింపు

చిరువ్యాపారులకు భరోసానిస్తున్న మహేష్

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలిలో గంటస్తంభం నుంచి పాత మీ సేవా కేంద్రం వరకు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పలు పండ్లు, ఇతరత్రా దుకాణాలను ఒకటో జోన్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో శుక్రవారం జివిఎంసి సిబ్బంది తొలగించారు. ఇరుకు రోడ్డులో ట్రాఫిక్‌కు ఇబ్బంది నేపథ్యంలో రోడ్డు పక్కల్లో ఉన్న దుకాణాలను తొలగించామని జెడిసి బొడ్డేపల్లి రాము తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి మహాలక్ష్మి నాయుడు. తొలగించిన చోటనే మళ్లీ దుకాణాల ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం

మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను తొలగించిన నేపథ్యంలో, ఆయా దుకాణదారులకు ప్రత్యామ్నాయంగా శాశ్వత పరిష్కారం చూపిస్తామని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ భరోసా నిచ్చారు. దుకాణాల తొలగింపు తర్వాత అక్కడి చేరుకున్న మహేష్, వ్యాపారులతో మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితుల్లోనూ వారి ఉపాధికి దెబ్బ రానీయబోమని భరోసా ఇచ్చారు. వారు వ్యాపారం చేసే చోట షెల్టర్లు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్డు ఇతర సదుపాయాలను కల్పిస్తామన్నారు. గంటస్తంభం వద్ద నిరుపయోగంగా ఉన్న దుకాణ సముదాయాన్ని త్వరలోనే వినియోగంలోకి తెస్తామన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడోవార్డు బోయివీధిలో జాలరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ సామాజిక భవనంలో శుక్రవారం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సంఘ సభ్యులు కాసరపు దుర్గారావు, పొలిరాజు, నాగరాజు, వి సత్యారావు, కె ఎల్లా జీ, కదిరి ఎల్లాజీ పాల్గొన్నారు.

ప్రజలకు దగ్గరగా వైద్య సేవలు

రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్

ప్రజలతో మాట్లాడుతున్న కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నివాస్

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ప్రజలకు దగ్గరగా వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ప్రవేశ పెట్టినట్లు రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ అన్నారు. మండలంలోని తంతడి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ పనితీరును పర్యవేక్షించారు. రోగులతో మాట్లాడారు. వైద్యులు రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. రోగులు చెబుతున్న అనారోగ్య సమస్యలను ఆన్లైన్ ద్వారా పొందుపర్చడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బంది, ప్రజలతో మాట్లాడుతూ ప్రజలకు మేలైన వైద్య సేవలు అందించడమే ఉద్దేశంతో దీనిని గ్రామ స్థాయిలో తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, ఫ్యామిలీ ఫిజీషియన్ మోడల్ పర్సన్ జ్యోతి, డిఎంహెచ్ఓ డాక్టర్ హేమంత్, తహశీల్దార్ శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ అలేఖ్య, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-అనకాపల్లి : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించి సంతృప్త స్థాయి పెరిగేందుకు చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా ప్రత్యేక అధికారి, ఆరోగ్యం కుటుంబ సంక్షేమశాఖ రాష్ట్ర సంచాలకులు జె.నివాస్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్నకి చెబుదాం కార్యక్రమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. అర్జీలపై ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్ అర్జీలపై సమీక్షిస్తూ ఏ ఒక్క అర్జీ కూడా ఎస్ఎల్ఏ దాటి వెళ్లకూడదని సూచించారు. రెవెన్యూ, పంచాయతీ, సర్వే శాఖలు సంతృప్తి రేటుపై మరింత దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ స్వరన్ రాజ్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకట రమణ, ఏఎస్పీ విజయ్ భాస్కర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సైకిళ్ల పంపిణీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి అమర్నాథ్

నేడు విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 9, 10వ తరగతి విద్యార్థినులకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చొరవతో, అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో 2550 సైకిళ్లను శనివారం పంపిణీ చేయనున్నారు. ఈ సైకిళ్ల పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను మంత్రి అమర్నాథ్ శుక్రవారం పరిశీలించారు. స్టేడియంకు వచ్చే విద్యార్థినులకు, వారి తల్లిదండ్రులకు తగిన ఏర్పాట్లు చేయాలని, స్టేడియం బయట ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆడపిల్లలను ప్రోత్సహించేందుకు సైకిళ్లను అందజేస్తున్నామని చెప్పారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ సుమారు కోటి 75 లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఈ సైకిళ్లను అందిస్తోందని చెప్పారు. టాటా కంపెనీకి చెందిన ఒక్కో సైకిలు సుమారు 6,500 రూపాయలు ఉంటుందని మంత్రి అమర్నాథ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సూరిబాబు, జాజుల రమేష్, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉపాధి హామీ సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-చోడవరం : గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ నిర్వహించిన నివేదికలను సమావేశంలో వినిపిస్తుండగా డ్వామా పిడి ఈ.సందీప్ పరిశీలించారు. పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలను సర్వే చేసిన సిబ్బంది సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎక్కువగా మస్టర్లు లిస్టుల్లో తప్పులు దొరలడాన్ని అధికారులు వీఆర్పీలను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పిడి ఎం.రోజా రాణి, డివిఓ నిర్మలాదేవి, ఏపీడీ ఓ శ్రీనివాసరావు, వీఆర్పీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము

నినాదాలు చేస్తున్న ముఠా కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము డిమాండ్ చేశారు. ఆగస్టు 2న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని శుక్రవారం జీపు జాతా కార్యక్రమం అచ్యుతాపురంలో రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఠా కార్మికులు పనిచేస్తున్న ప్రదేశాలలో పర్యటించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ సంవత్సరాల తరబడి ముఠా కార్మికులుగా పనిచేస్తున్నా ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. చాలీచాలని కూలీలతో అనారోగ్యాలకు గురవుతున్న సంక్షేమ పథకాలు వారి చెంతకు చేరడం లేదని తెలిపారు. పిఎఫ్, ఈఎస్ఐ, సంక్షేమ బోర్డు, బీమా, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలకు గురైన అనారోగ్య పాలైన ప్రభుత్వమే బాధ్యత వహించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘం కన్వీనర్ రాజాన సత్తిబాబు, కార్మికులు తాతారావు, రాజు, వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి- అనకాపల్లి : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారని మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. మండలంలోని మామిడిపాలెం గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపడంతో అక్కడి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ల్యాండ్ పూలింగ్లో భూములు ఇచ్చిన వారికి, అతి త్వరలోనే కొత్త లేఅవుట్లో స్థలాలు మంజూరు చేస్తామని మంత్రి అమర్నాథ్ తెలిపారు. ఈ గ్రామాన్ని ఆనుకుని ఉన్న కొండమీద నుంచి వచ్చే వర్షపు నీరు సక్రమంగా కాలువలోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి గొర్లి సూరిబాబు, ఎంపిటిసి సభ్యుడు, గ్రామ వైసిపి అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మనుషుల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- సబ్బవరం

మనుషుల అక్రమ రవాణా పట్ల సమాజంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఇన్ఛార్జి ఉపకులపతి ప్రొఫెసర్ పి. శ్రీసుధ సూచించారు. వర్సిటీ సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా వారి ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విసి శ్రీసుధ మాట్లాడుతూ విద్యార్థులు, మహిళల అక్రమ రవాణా గురించి, దానికి గల కారణాలు గురించి వివరించారు. సమాజంలో అమ్మాయిలు, యువకులు ఉపాధి, ప్రేమ పేరుతో ఎన్నో రకాలుగా అక్రమ రవాణాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ అక్రమ రవాణా నేరమని, దీని నుండి బాధితులను రక్షించడానికి అనేక చట్టాలు ఉన్నాయని చెప్పారు. అక్రమ రవాణా నివారణ చట్టం 1956, పోక్సో చట్టం వంటివి ఉన్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉమెన్ అండ్ చైల్డ్ లా డైరెక్టర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిఎల్ఓతో మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

బిఎల్ఓలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఓటర్ల వెరిఫికేషన్లో బిఎల్ఓలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్ అన్నారు. స్థానిక చిన్న రాజుపేట, వడ్డీల వీధి, పిల్లా వారి వీధి, ఎర్ర వారి వీధి 194,195, బూత్ల ఓటర్ వెరిఫికేషన్ను బిఎల్ఓ ఆఫీసర్ పద్మ సురేష్ శుక్రవారం చేపట్టగా, టిడిపి నాయకులతో కలిసి నాగజగదీష్ ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగఓట్లు నివారించే బాధ్యత అన్ని రాజకీయ పార్టీలతో పాటు బిఎల్ఓలపై కూడా ఉందన్నారు. కాగా వీరి పరిశీలనలో చనిపోయిన వారు 46, డబల్ ఎంట్రీలు ఒకే ఓటర్ లిస్టులో 21 పేర్లు నమోదయ్యాయని, ఈ ప్రాంతం నుండి 133 మంది ఓటర్లు వేరే ప్రాంతానికి వలస పోయారని, వారిని జాబితా నుండి తొలగించాలన్న విషయాన్ని కూడా బిఎల్ఓ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని నాగ జగదీష్ హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కుప్పిలి జగన్మోహన్ రావు, పిళ్లా తారకేష్, కాండ్రేగుల జగదీష్, రేబాక వరం, కోట్ని సన్యాసమ్మ, బోడి వెంకట్రావు, కోటి రామకృష్ణ, మల్ల శివన్నారాయణ, సుగ్గు రామారావు, కర్రి కృష్ణ, దూళి శివ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయ విధాన వలన నాణ్యమైన దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు అధికారి సిహెచ్ లచ్చన్న తెలిపారు. మండలంలోని తుమ్మపాల వెంకటేశ్వర కల్యాణ మండపంలో ప్రకృతి వ్యవసాయంలో రైతు శాస్త్రవేత్త శిక్షణ శిబిరం రెండో రోజులో భాగంగా ఆయన మాట్లాడారు. ఏడాది పొడుగునా ప్రతి పంటలో బహుళ పంటలు వేసుకునే అవకాశం ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉందన్నారు. దీనివలన ప్రతి నెలకు 25 వేల నుంచి 50 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, శాస్త్రీయతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విధానం వలన వచ్చే పంటలను వినియోగించడం ద్వారా ప్రజారోగ్యం పెంపొందుతుందన్నారు. అనంతరం పీఎండీఎస్ క్షేత్ర సందర్శన చేసి పి ఎం డి ఎస్ శాస్త్రీయత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ కృష్ణారావు, జిల్లా కోఆర్డినేటర్ కీర్తి గోవిందు, రాష్ట్ర స్థాయి ట్రైనర్స్, మెంటర్స్ రైతు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన

మునగపాక రూరల్ : చీడపీడల నివారణకు బ్రహ్మాస్త్రం కషాయం అద్భుత ఫలితాలను ఇస్తుందని ప్రకృతి వ్యవసాయ మండల కమ్యూనిటీ ఆర్గనైజర్ పాతాళం సత్యనారాయణ అన్నారు. మండలంలోని చూచుకొండ గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఖరీఫ్ సీజన్లో వరి, చెరకు మొదలగు ప్రధాన పంటల్లో వచ్చే పురుగు తెగుళ్లకు 80 లీటర్ల బ్రహ్మాస్త్ర కషాయం రైతుల సమక్షంలో తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న పురుగుల నివారణకు మీనామృతం వాడాలని, రసం పీల్చే పెద్ద పురుగులు, గొంగళి పురుగుల నివారణకు బ్రహ్మాస్త్రం వాడాలని సూచించారు. పురుగు ఉధృతిని బట్టి రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. దీని వల్ల రైతులకు పురుగు మందుల ఖర్చులు తగ్గటంతో పాటుగా పంట దిగుబడి పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు కర్రి కన్నారావు, కోరుమిల్లి నాగేశ్వరరావు, సిహెచ్ నూకరత్నం, గౌరీ, సిహెచ్ పార్వతి పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

ఎమ్మెల్యే దృష్టికి తిమ్మరాజుపేట సమస్యలు

ప్రజాశక్తి- అచ్యుతాపురం

తమ గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన ప్రజలు స్థానిక ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజుకు విన్నవించారు. గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు తమ సమస్యలను తెలియజేశారు. గ్రామ అభివృద్ధికి నిధులు కొరతతో ఎ టువంటి సమస్యలు చేయలేకపోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లాలం రాంబాబు, నర్లా కుమారు, గ్రామ నాయకులు శరగడం శివబాబు, వైసిపి నాయకులు కోన బుజ్జి, దేశంశెట్టి శంకర్రావు, పిన్నమ్మ రాజు వాసు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, శరగడం జగ్గారావు, ఎం లక్ష్మి సూర్యనారాయణ, ఎంపీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ తహశీల్దారు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు రాళ్లు చూపుతున్న కోటేశ్వరరావు

రీ సర్వే భూములకు హద్దురాళ్ళు సిద్ధం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని తోటాడ పంచాయతీ పరిధిలో ఇటీవల చేపట్టిన జగనన్న భూరక్ష రీ సర్వేలో గుర్తించిన సుమారు 860 ఎకరాల రైతు భూములకు త్వరలో హద్దు రాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి సచివాలయానికి వచ్చిన హద్దు రాళ్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. అధికారులు చేపట్టిన సర్వే ఆధారంగా ఆయా రైతుల భూములకు హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. హద్దురాళ్లు ఏర్పాటు చేస్తున్నప్పుడు ఆయా భూముల రైతులు అధికారులకు, సచివాలయ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తారువ గ్రామానికి చెందిన మల్లిరెడ్డి మహాలక్ష్మినాయుడు భార్య కుమారి (51) అదృశ్యంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.... మల్లిరెడ్డి కుమారి మానసిక స్థితి బాగోలేదు. ఈ నెల 23న ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో కుమారి పొలం చూడడానికి వెళ్ళి తిరిగి సాయంత్రమైనా రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆమె ఆచూకీ కనిపించలేదు. దీంతో ఆమె భర్త మల్లిరెడ్డి మహాలక్ష్మినాయుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమారి ఇంటి నుండి వెళ్లినప్పుడు పసుపు రంగు చీర కలిగి ఉంది. ఎస్ఐ డి.నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9440796092 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

కొప్పాకలో సిమెంటు రోడ్లు నిర్మాణం

ప్రజాశక్తి- అనకాపల్లి : జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో 84వ వార్డు కొప్పాక గ్రామ బిసి కాలనీలో 20 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. బీసీ కాలనీ, రామాలయం ఏరియా, సుబ్రహ్మణ్యం కాలనీ ప్రాంతాలలో నిర్మాణం జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి నీలబాబు, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మిర్తిపాటి గోపాలరావు, వానపల్లి బాబూరావు బోయిన మురళి గిరి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే పొదుపు సంఘాలు

ప్రజాశక్తి-సబ్బవరం : మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే పరస్పర సహాయ సహకార పొదుపు సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మండల వెలుగు ఎపిఎం సాయి రమేష్ అన్నారు. మండలంలోని ఇరువాడ గణపతినగర్‌లో గల మహాగణపతి గ్రామ పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం 12వ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సాయి రమేష్ మాట్లాడుతూ సంఘం ఆర్థిక లావాదేవీలు, ప్రభుత్వ పథకాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమం గ్రామ సంఘం అధ్యక్షురాలు కోన సోమలత, సీసీ నీలకంఠ నాయుడు, రేసుపుడి కుమారి, కర్రి ధనలక్ష్మి, మామిడి వరహాలమ్మ, మామిడి లక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెలుగు ఎపిఎం సాయి రమేష్

రైల్వే ఓవర్ బ్రిడ్జి భూ సేకరణకు గ్రామసభ

తమకు తెలియకుండా చేయడంపై రైతుల అభ్యంతరం

ప్రజాశక్తి-అనకాపల్లి

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిమిత్తం రాజుపాలెం రెవిన్యూ భూమి సేకరణలో భాగంగా అనకాపల్లి డిప్యూటీ తహశీల్దారు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తూరు నర్సింగరావుపేట నుండి రాజుపాలెం గ్రామంలో దారిలో గల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం నిమిత్తం రాజుపాలెం రెవిన్యూ సర్వేనెంబర్ 60, 61, 62, 63, 148, 149 నెంబర్లలో జిరాయితీ భూమిని సేకరించి ఉన్నందున సంబంధిత రైతులు నుండి అభ్యంతరాలు స్వీకరించారు. అయితే భూ సేకరణ ఎప్పుడు చేశారో తమకు తెలియదని, గ్రామంలో ఎటువంటి దండోరా వేయలేదని రైతులు తెలిపారు. భూ సేకరణ చేసేటప్పుడు ముందుగా నోటీసులు అందజేయాలని, తమ భూమికి ఇరువైపులా బౌండరీస్ చూపించాలని, రైల్వే పై ఓవర్ బ్రిడ్జి ప్లానింగ్‌ని ముందుగా చూపించాలని పేర్కొన్నారు. ఇప్పుడున్న రోడ్డుకి సమాంతరంగా కుడివైపు ఎడమవైపు భూసేకరణ చెయ్యాలని కోరారు. భూ సేకరణ చేసిన భూమి బాధితులకు ఇక్కడున్న మార్కెట్ విలువ ప్రకారం ఉన్న ఇండ్ల స్థలాలను ఇప్పించాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ గ్రామం నుండి భూసేకరణ చేసిన రైల్వే లైన్, వైఎల్ఎంసి, కాలువ, ఎన్‌హెచ్-5 నిర్మాణంలో భూములు పోయినవారికి నేటికీ ఎటువంటి జీవనోపాధి చూపించలేదని, ఇప్పుడైనా భూమి పోతున్న రైతులకు జీవన ఉపాధి చూపిస్తూ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. భూములు కోల్పోతున్న రైతులకు నోటీసులను అందించి, కోల్పోతున్న భూములకు, ఇల్లులకు ఎంత నష్టపరిహారం గవర్నమెంట్ రూల్ ప్రకారం ఇస్తున్నారో లిఖితపూర్వకంగా సదరు రైతులకు తెలియజేస్తూ, సంబంధిత అధికారులందరితో మరల గ్రామసభను ఏర్పాటు చేయాలని కోరారు. అలా చేయని పక్షాన భూములు ఇవ్వమని కరాఖండిగా చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సిరసపల్లి సన్యాసిరావు, సచివాలయ కన్వీనర్ కరణం సురేష్, గైపూరి భాస్కరరావు, కసిరెడ్డి అప్పలకొండ, కసిరెడ్డి శ్రీనివాసరావు, అంజూరి కళ్యాణం, భూ సేకరణ రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కలు నాటుతున్న జెడ్‌పిటిసి రాంబాబు

పర్యాటక ప్రాంతంగా పాండవుల చెరువు

ప్రజాశక్తి - వద్దాది : చారిత్రిక నేపథ్యం కలిగిన వద్దాది పాండవుల చెరువును ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సహకారంతో పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేస్తామని జడ్పిటిసి దొండా రాంబాబు చెప్పారు. అమృత్ సరోవర్ ప్రాజెక్టులో భాగంగా శుక్రవారం పాండవుల చెరువు చుట్టూ ఒకేసారి 600 కొబ్బరి మొక్కలను నాటే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ వద్దాది పాండవుల చెరువుకి మహాభారత కాలం నాటి ఘటనలతో సంబంధం ఉందని గుర్తు చేశారు. ఇలాంటి చెరువుని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, దాతల సాయంతో సేద తీరేందుకు సిమెంటు బల్లలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడి బి.శ్రీనివాసరావు, ఏపీవో మురళి, ఎంపీటీసీ కోరుకొండ లీలావతి, రమణ పాల్గొన్నారు.

డైట్‌లో ముగిసిన అమెజాన్ వెబ్ సర్వీసెస్ వర్కుషాప్

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'అమెజాన్' వెబ్ సర్వీసెస్ నిర్వహించిన వర్కుషాప్ శుక్రవారంతో ముగిసింది. వారం రోజుల పాటు సిఎస్ఈ, సిఎస్ఎం విద్యార్థులకు జరిగిన ఈ వర్కుషాప్ ద్వారా విద్యార్థులు క్లౌడ్ ఫౌండేషన్, క్లౌడ్ ఆపరేషన్ కోర్సు కంప్లీషన్ సర్టిఫికెట్ సంపాదించుకొంటారని సిఎస్ఈ హెచ్ఓడి డాక్టర్ కె.సుజాత తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు మాట్లాడుతూ ఈ సర్టిఫికెట్స్ వారి ఉద్యోగ భవిష్యతుకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.రిసోర్స్ పర్సన్స్ వి.అనిల్, జె.లోవబాబు అమెజాన్ వెబ్ సర్వీసెస్ లోని లోడ్ బ్యాలెన్సింగ్ , వెబ్సైటు హోస్టింగ్ , క్రియేషన్ ఆఫ్ డేటాబేస్ వంటి వివిధ టెక్నిక్స్‌ని నేర్పించామని పేర్కొన్నారు. వర్క్ షాప్‌లో పాల్గొనడానికి అవకాశం ఇచ్చిన సిఎస్ఈ హెచ్ఓడి, ప్రిన్సిపాల్, ఛైర్మన్‌కి అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మహాశక్తి ప్రచార రథం ప్రారంభం

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ చేపట్టిన మహాశక్తి ప్రచార రథం శుక్రవారం ప్రారంభమైంది. స్థానిక నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జెండా ఊపి దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీలా మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకే టీడీపీ మేనిఫెస్టోలో మహాశక్తి పొందుపర్చిందని తెలిపారు. తల్లికి వందనం పథకంతో ఇంట్లో ప్రతి విద్యార్థికి ఏడాదికి 15వేల రూపాయలు అందజేయనున్నట్టు వెల్లడించారు. మహిళల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు బిఎస్ఎంకే జోగి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన మహా శక్తి కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బొర్రా నాగరాజుతో గవరపాలెం రజకుల పేటలో ఇంటింటికి వెళ్లి మహాశక్తి పథకం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి నీలబాబు, టిడిపి నాయకులు మళ్ళ సురేంద్ర, బొద్దపు ప్రసాద్, కొణతాల రత్న కుమారి, సేనాపతి స్వరూపా, సబ్బవరపు గణేశ్, ఎంపీటీసీ మదుపాడ లక్ష్మీ, సంకర్ల పద్మావతి, కాయల ప్రసన్న లక్ష్మీ, హేమా, సతీశ్ కుమార్, ప్రభావతి, సత్యవతి, ఆళ్ళ రామచంద్రరావు, పచ్చికూర రాము తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల బరిలోకి యువ కెరటం

పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న రాయపురెడ్డి కృష్ణ

రాయపురెడ్డి కృష్ణను అభినందిస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-కె.కోటపాడు

మాడుగుల నియోజవర్గం బరిలోకి ఓ యువ కెరటం దూకింది. నియోజకవర్గంలో జనసేన పార్టీకి నాయకత్వం వహిస్తున్న వి.మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామానికి చెందిన రాయపురెడ్డి కృష్ణ 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు తనను ఆకర్షించడంతో రెండేళ్ల క్రితం జనసేన పార్టీలో చేరినట్లు ఆయన వెల్లడించారు. కృష్ణ బీటెక్ పూర్తి చేసి గ్రామంలోనే ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. యువకుడు, ఉత్సాహవంతుడైన కృష్ణ మాడుగుల నియోజకవర్గంలో అన్ని గ్రామాల నుంచి యువకులను జనసేనలోకి తీసుకొస్తున్నట్లు ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

పలు సేవా కార్యక్రమాలు

గ్రామాల్లో యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్లు అందజేత, ప్రజలు సేదతీరేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు, రైతులకు పాల కేన్ల పంపిణీ, అనారోగ్యంతో బాధపడితే పేదలకు ఆర్థిక సహాయం అందించడం, గ్రామాల్లో నూతనంగా నిర్మించే దేవాలయాలు, చర్చిలు, మసీదులు అసంపూర్ణంగా ఉండిపోతే వాటిని పూర్తి చేయడానికి విరాళాలు అందజేయడం, డొక్కా సీతమ్మ పేరుట అన్న సమారాధనలు, వారపు సంతల్లో మంచినీళ్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టినట్లు కృష్ణ వెల్లడించారు.

ఉచిత అంబులెన్స్ సౌకర్యం

మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలకు ఎటువంటి ఆపద సంభవించినా వెంటనే ఆసుపత్రికి తరలించడానికి వీలుగా దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలకు ఒక అంబులెన్స్, చీడికాడ, మాడుగుల మండలాలకు ఒక అంబులెన్స్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిని ఇటీవల మాడుగుల మండలంలో ప్రారంభించారు. ఆపదలో ఉన్నవారు ఒక్క ఫోన్ కాల్ చేస్తే అంబులెన్సులు వారి వద్దకు చేరుకొని చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం వంటి ఆసుపత్రులకు ఉచితంగా తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు.

పార్టీ కార్యక్రమాల్లో...

గతంలో పవన్ కళ్యాణ్ విశాఖపట్నంలో రోడ్ షోకు వచ్చినప్పుడు నోవోటెల్ హోటల్ దగ్గర జరిగిన గొడవలో ప్రభుత్వం అరెస్ట్ చేసి జైలుకు పంపిన 9 మందిలో కృష్ణ కూడా ఉన్నారు. రెండు వారాల పాటు జైలు జీవితాన్ని అనుభవించారు. ఆ సంఘటన జరిగినప్పటి నుంచి పవన్ కళ్యాణ్‌కు కృష్ణ మరింత దగ్గరైనట్లు కృష్ణ వెల్లడించారు. కృష్ణ నాయకత్వంలో నియోజకవర్గం నాలుగు మండలాల్లో జనసేన మండల అధ్యక్షులను ఏర్పాటు చేసి, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. పార్టీ అధిష్ఠానం అనుమతిస్తే 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాడుగుల నియోజవర్గం జనసేన పార్టీ అభ్యర్థిగా ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మీద పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు కృష్ణ తెలిపారు. తను ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

మండల సమావేశంలో..

సమస్యలపై ఏకరువు

జగనన్న కాలనీలు, ఉపాధి హామీ, జల్ జీవన్ తదితర వాటిపై సభ్యుల ప్రశ్నల వర్షం

ప్రజాశక్తి-కోటవురట్ల:. పేదలు నిర్మించుకుంటున్న జగనన్న కాలనీలకు, ఉపాధి హామీ పని వేతనాలు చెల్లింపు జాప్యంపై శుక్రవారం ఎంపీపీ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువెళ్లారు. జగనన్న ఇళ్లకు వివిధ దశల్లో ఉన్న వారికి బిల్లులు చెల్లింపులు, 90 రోజుల ఉపాధి హామీ పని వేతనాల సొమ్ము అందకపోవడంపై బికేపల్లి ఎంపీటీసీ సభ్యులు రాంబాబు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కోటవురట్ల ఎంపీటీసీ సభ్యులు పి.సూర్యారావు, అన్నవరం ఎంపీటీసీ సభ్యురాలు రమణమ్మ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయని, పూర్తిస్థాయిలో కుళాయి కనెక్షన్లు ఇవ్వలేదని, నచ్చిన వారికి ఇస్తున్నారని తెలిపారు. కోటవురట్ల సీతారామరాజు నగర్ పరిసర ప్రాంతాలలో జలజీవన్ మిషన్ పనులు జరగాల్సి ఉండగా ఎవరు పట్టించుకోలేదని నిలదీశారు. రాజుపేట సచివాలయం, రైతు భరోసా, వెల్నెస్, భవన నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయని రైతు భరోసా కేంద్రం అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారని, మినీ గోకులం నిధుల పై ఆ గ్రామ సర్పంచ్ వెంకటరమణ తెలిపారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ వద్ద కనీస సౌకర్యాలు కరువయ్యాయని విద్యుత్ లైన్లు నిర్మాణాన్ని అధికారులు పట్టించుకోలేదని సర్పంచ్ అనిల్ కుమార్ తెలిపారు. కొడవటిపూడి గ్రామ సర్పంచ్ అప్పారావు మాట్లాడుతూ, పశుగ్రాసం కొరతతో గ్రామీణ ప్రాంత రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి మాట్లాడుతూ, మండలంలో ఇండియన్ గ్యాస్‌కు సంబంధించి యాజమాన్యం లబ్ధిదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న విషయం సభ దృష్టికి తీసుకువెళ్లారు. రెవెన్యూ సిబ్బంది తక్షణమే వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. రహదారులు భవనాల శాఖ ఇంజనీరు జూనియర్ రెడ్డి మాట్లాడుతూ, వెంకటాపురం మీదుగా కొడవటిపూడి వరకు రహదారి నిర్మాణానికి రెండు కోట్ల 45 లక్షలు మంజూరు అయ్యాయని, మండల పరిషత్ ఎదురుగా రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది సహకారంతో పరిష్కారం చేపడతామన్నారు.

సమస్యలను ప్రస్తావిస్తున్న సభ్యులు

వైస్ ఎంపీపీ దత్తుడు రాజు మాట్లాడుతూ, సచివాలయ సిబ్బందికి ఎన్నికల విధులనుండి మినహాయింపు నివ్వాలన్నారు. తహసిల్దార్ జానకమ్మ మాట్లాడుతూ, ఓటర్ ధ్రువీకరణ సర్వే జరుగుతున్నందున గ్రామస్థాయిలో నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారిని సరోజిని, వైస్ ఎంపీపీ చెక్కా సుజాత, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు తెలియజేస్తున్న స్థానికులు

సమస్యలపై ఎమ్మెల్యేకు మొర

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ 23వ వార్డులో శుక్రవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గణేష్ పర్యటించారు. సంక్షేమ పథకాల అమలులో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అక్కడికక్కడే అధికారులకు ఎమ్మెల్యే తక్షణ చర్యలకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి, 23వ ఇంఛార్జి కణితి అన్నపూర్ణ, కణితి వాసు,ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ ఆరుగొల్లు రాజుబాబు, పెట్ల నాయుడు, యలమంచిలి నాని, అయ్యరక కార్పోరేషన్ డైరెక్టర్ కర్రి కనక మహాలక్ష్మి, షిరిడీ సాయి దేవస్థానం నిర్వాహకులు కర్రి రాంగోపాల్, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, ముస్లిం సంచార జాతుల స్టేట్ డైరెక్టర్ చోటి, మున్సిపల్ కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, సిరసపల్లి నాని, కో ఆప్షన్ కౌన్సిలర్ షేక్ రోజా, ఎండి భాష, వైసిపి మహిళ విభాగం టౌన్ అధ్యక్షురాలు గణమ్మ, కార్యదర్శి లలిత, వైసిపి నాయకులు కొణతాల వరలక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మళ్ల గణేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శారద, దనిమిరెడ్డి ప్రసాద్, టౌన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏకాశివ, కనకదుర్గ దేవస్థానం చైర్మన్ సతీష్ పాల్గొన్నారు.

పాల్గొన్న విద్యార్థులు

బహుముఖ కార్యక్రమాలు

ప్రజాశక్తి-మాడుగుల:కింతలి జడ్‌పి ఉన్నత పాఠశాల పిఎం శ్రీ పథకానికి ఎన్నికైన సందర్భంగా పాఠశాలలో జన బగీ దారి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కథలు చెప్పడం, రంగ వల్లుల పోటీలు, వివిధ వస్తువుల తయారీ, యోగా వంటి కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్‌ఎం నరసింగరావు, ఇతర ఉపాధ్యాయుల అధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ఈ - పంట నమోదు చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

ప్రజాశక్తి -నక్కపల్లి :పంటలు సాగు చేసే ప్రతి రైతుకు రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ పంట నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ బి మోహన్ రావు సూచించారు. మండలంలోని గొడిచెర్లలో శుక్రవారం వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్, రైతు భరోసా సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ పథకాలు సున్నా వడ్డీ పంట రుణాలు, వైఎస్ఆర్ ఉచిత పంటల భీమా, రైతు భరోసా, పండించిన పంటని ప్రభుత్వం కొనుగోలు, ఇన్ పుట్ సబ్సిడీలకు ఈ పంట తప్పనిసరి అని అన్నారు. రైతు ఆధార్ కార్డ్, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్ ఖాతాను రైతు భరోసా కేంద్రానికి తీసుకువెళ్లి పండించే పంటను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ పంట నమోదు పై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో దోసలపాడు గ్రామంలో ఈ పంట నమోదు ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎమ్.వసంత కుమారి, ఆర్‌బీకె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న మోహన్ రావు

మట్లాడుతున్న రామానాయుడు

ఓటర్ల నమోదుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-మాడుగుల:ఓటర్ల నమోదు పట్ల కార్యకర్తలు జాగ్రత్త వహించాలని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు సూచించారు. శుక్రవారం పోతన పూడి పంచాయతీ పరిధిలో ఓటర్ల నమోదు కార్యక్రమం పరిశీలించారు. నియోజకవర్గంలో 4500 ఓట్లు తొలగిపోతాయని, వాటిని పరిశీలించాలన్నారు. బూత్ ఏజంట్లు ఇంటింటికీ బి ఎల్ ఓ లతో వెళ్లి పరిశీలించాలన్నారు. తొలగిన ఓట్ల వివరాలు ఇంటింటికీ వెళ్లి చూడాలని, రానున్న ఎన్నికలకు సిద్దం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోరుకొండ భవాని సాంబమూర్తి, పడాల నారాయణ మూర్తి, సూరి అప్పారావు, పెంటకోట రాము, మడగల రమణ, నానాజీ, వేపాడ రామారావు, చిన్ని అప్పారావు, వీర బాబు, రేఖ రమణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:మండలంలో గబ్బాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ వీరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గబ్బాడ టిడిపి సీనియర్ కార్యకర్త కోడి సోమరాజు నాయకత్వంలో సుమారు 20 కుటుంబాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ వైఎస్ఆర్ పార్టీ నాయకులు మాకిరెడ్డి వెంకు నాయుడు ఆధ్వర్యంలో వీరు పార్టీలోకి వచ్చారు ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, గురందర పాలెం సర్పంచ్ చినబాబు పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్‌లో ఘనంగా స్నాతకోత్సవం

మాట్లాడుతున్న విజయ్ ప్రకాష్

ప్రజాశక్తి -పాయకరావుపేట:స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో పెద్ద బాల వనం యు.కె.జి విద్యార్థులకు స్నాతకోత్సవం శుక్రవారం నిర్వహించి పట్టాలను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆశయ సాధనకు తల్లిదండ్రులు చేయూత నిచ్చి బంగారు భవిష్యత్ కి బాటలు వేయాలని కోరారు. సీనియర్ ప్రిన్సిపల్ ఎం. వి.వి ఎస్ మూర్తి మాట్లాడుతూ, విద్యార్థులతో తల్లిదండ్రులు రోజుకి ఒక గంటైనా గడపాలని, వారితో కథలు, వివిధ విషయాలు చర్చించడంతో విషయ పరిజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. నైపుణ్యాలు పెరగడానికి కొంత సమయం పడుతుందని, వారికి చేయూత నిచ్చి అన్ని విధాలా సహకరించాలని అయన కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న అప్పలరాజు. మత్స్యకారులు

మత్స్యకారుల నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో కొత్త పైపులైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా శుక్రవారం నాటికి 598వ రోజుకు చేరింది .ఆందోళన శిబిరం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో మత్స్యకారులు పైపులైనుకు వ్యతిరేకంగా మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ పైపులైనుకు అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీ.సోమి, సీహెచ్ సోమేష్, పి.తాతీలు, ఎం.మహేష్‌బాబు, పి.స్వామి, పీ.రమణ, కె.భూలోక, నూకరాజు పాల్గొన్నారు.

ఏర్పాటు చేసిన సిమెంట్ బల్ల

సిమెంట్ బల్లల ఏర్పాటు

ప్రజాశక్తి -రోలుగుంట:మండలంలోని బుచ్చంపేట గ్రామ పంచాయతీలో జనసేన నేతలు సిమెంట్ బళ్లను ఏర్పాటు చేశారు. ఈ సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చింపేట జనసేన పార్టీ అధ్యక్షులు గాలి బాలరాజు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి

వైస్ ఎంపిపి వీసం నానాజీ

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ వీసం నానాజీ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు, ఈవోపీఆర్డీ వెంకట నారాయణ తదితరులు ఉపాధి పథకం సిబ్బందికి పలు సూచనలు చేశారు. భూగర్భ జలాల పరిరక్షణకు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద నీరు నిల్వ లేకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నక్కపల్లి 50 పడకల ఆస్పత్రి, మండలం లోని అన్ని గ్రామాల్లో వున్న పాఠశాలలు, ప్రభుత్వ భవనాల వద్ద కూడా వీటిని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నానాజీ

మణిపూర్ అకృత్యాలపై నిరసనలు

నర్సీపట్నంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థుల నిరసన

చీడికాడలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మణిపూర్‌లో జరిగిన మారణకాండపై భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శివపురం, ఐదు రోడ్ల జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించాలని, శాంతి భద్రతలు కాపాడాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ ఎం.రమణ మాట్లాడుతూ, మణిపూర్‌లో శాంతిభద్రత నెల కొల్పడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం అత్యాచారాలు జరుగుతుంటే చూసీచూడనట్టు చూడటం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రెటరీ ఎస్.రమణ, డివిజన్ సెక్రెటరీ గీతాకృష్ణ, డివిజన్ ప్రెసిడెంట్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

చీడికాడ:మణిపూర్‌లో మహిళలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిఐటియు నేత ఆర్.దేముడు నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో శుక్రవారం నిరసన నిర్వహించారు. ఈ సందరభంగా సిఐటియు నేత దేవుడు నాయుడు, మండల అంగన్వాడి యూనియన్ నాయకురాలు మేడపరెడ్డి జానకిలు మాట్లాడుతూ, మణిపూర్‌లో మహిళలపై సామూహిక అత్యాచారాలు, నగ్న ప్రదర్శన, చంపేయడం వంటి ఘటనలు చాలా దారుణ మన్నారు. యావత్ దేశం సిగ్గుతో తలదించుకునే విధంగా ఈ ఘటనలు ఉన్నాయన్నారు.హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్న సంఘ విద్రోహ శక్తులపై బిజెపి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చాలా అన్యాయమన్నారు. దీని వెనుక ఉన్న మైనింగ్ మాఫియా, కార్పొరేట్ కంపెనీలు ఉన్నాయని తెలిపారు.ఇప్పటికైనా గిరిజన మహిళలపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ప్రాజెక్టు నాయకులు జానకి రాజులమ్మ, చిన్నమ్మలు, రవణమ్మ, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

తగరపువలస:మణిపూర్‌లో కొద్దిరోజులుగా చోటుచేసుకుంటున్న అకృత్యాలను నిరసిస్తూ సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జంక్షన్‌లో నిరసన చేపట్టారు.పార్టీ జోన్ కార్యదర్శి రవ్వ నరసింగరావు మాట్లాడుతూ, మణిపూర్‌లో అల్లర్లు రోజురోజుకూ పెరుగుతుంటే, వాటిని అరికట్టాల్సిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు.కార్యక్రమంలో పలువురు పార్టీ కార్యార్తలు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

4న రహదారి దిగ్బంధం : సిపిఎం

ప్రజాశక్తి-యస్.రాయవరం:వచ్చే నెల 4న అడ్డురోడ్డు నుండి నర్సీపట్నం వెళ్ళే రోడ్డును దిగ్బంధనం చేయనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అప్పలరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం అడ్డురోడ్డులో స్థానిక విలేఖరులతో మాట్లాడారు. అడ్డురోడ్డు నుండి నర్సీపట్నం వెళ్ళే ప్రధాన రహదారి కోటవురట్ల మండలం అల్లుమియ్యపాలెం జంక్షన్ వరకు పెద్ద ఎత్తున గోతులు పడి ఉందన్నారు. ఈ రోడ్డు గుండా ప్రయాణం చేసే ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఈనెల 12 న ప్రయాణికులతో సంతకాలు చేయించి, 17 న అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కి స్పందనలో వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. నేటికీ రోడ్డు మరమ్మతులు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతు చేపట్టకుంటే ఆగష్టు 4న దిగ్బంధిస్తామని ఎం.అప్పలరాజు తెలిపారు. దీనిని ప్రజలు అర్థం చేసుకొని సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ఎం.సత్యనారాయణ, .కె.సుబ్బాజీ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-కోటవురట్ల:అణుకు గ్రామానికి రహదారి, పాఠశాల భవనం వంటి మౌలిక వసతులు కల్పనకై గిరిజన ప్రాంత ప్రజలు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారం నాటికి 22వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గిరిజనులు శిబిరం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసనతో దీక్ష చేపట్టారు రహదారి, పాఠశాల సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు డేవిడ్‌రాజు, గిరిజనులు పాల్గొన్నారు.

ఎపిలో కానరాని అభివృద్ధి : బిజెపి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ:రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి కానరావడం లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురంధరేశ్వరి విమర్శించారు. ఆమె విశాఖ జిల్లా పర్యటనకు శుక్రవారం వచ్చిన సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం పెద్ద ఎత్తున సాయం చేస్తున్నా ఏమీ ఇవ్వడం లేదంటూ వైసిపి ప్రభుత్వం దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. కేంద్ర నిధులను రాష్ట్రం దారి మళ్లిస్తూ జేబులు నింపుకుంటోందని విమర్శించారు. రైల్వే జోన్‌కు కేంద్రం కట్టుబడి ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇస్తున్న ఇళ్లపై వైసిపి శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఎపిలో ఈ ఏడాది నిర్వహించిన పెట్టుబడుల సదస్సు అనంతరం ఎంత మొత్తంలో పెట్టుబడులు వచ్చాయో చెప్పాలన్నారు. రాష్ట్రంలో ల్యాండ్ మాఫియా అక్రమాలు పెరుగుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సిఎం జగన్ నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, విశాఖ ఎంపీ ఇంట్లో దుండగులు చొరబడినా రక్షించే నాథుడే కరువయ్యాడని తెలిపారు. మహిళలపై నానాటికీ దాడులు పెరుగుతున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల సంక్షేమం తమ బాధ్యతని, ఎలా అయితే లాభదాయకంగా ఉంటుందో ఉక్కు కర్మాగారం విషయంలో అలా ముందుకు వెళ్తామని చెప్పారు. పురంధరేశ్వరి రాక నేపథ్యంలో ఎయిర్‌పోర్టు నుంచి తొలుత బిజెపి కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

వరదల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

ప్రజాశక్తి-పాడేరు: చింతూరు డివిజన్‌లో ప్రస్తుత వరద పరిస్థితి కారణంగా సహాయ కార్యక్రమాలపై పర్యవేక్షణకు ఇద్దరు ప్రత్యేక ఉప కలెక్టర్లను మండల ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసారు. కూనవరం ప్రత్యేక ఉప కలెక్టర్ వి. వెంకట రమణను, కూనవరం ప్రత్యేక అధికారిగాను, వి.ఆర్ పురం ప్రత్యేక ఉప కలెక్టర్ జి.లక్ష్మీపతిని వి.ఆర్.పురం ప్రత్యేకాదికాగాను నియమించారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట గ్రామంలోని రైతులకు బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ రిసోర్సు పర్సన్ గుణావతి మాట్లాడుతూ, వరి పంటలో అధిక నష్టాన్ని కలిగించే పెద్ద పురుగు, గొంగళి పురుగులను నాశనం చేసి పంట ఎదుగుదలకు, దిగుబడికి బ్రహ్మాస్త్రం ద్రావణం ఎంతగానో ఉప యోగపడుతోందన్నారు. వేపాకు, ఉమ్మెత్తి, బొప్పాయి, శీతాఫలం, ఆముదం వంటి ఐదు రాకాల ఆకులను మూడు కేజీల చొప్పున ముద్దగా చేసి నాలుగు పొంగులు వచ్చే వరకూ మరగబెట్టి 48 గంటలు చల్లార్చిన తర్వాత 15 లీటర్ల గోమూత్రంలో కలిపి ఆ కషాయాన్ని దాచుకోవాలన్నారు. 200 లీటర్ల నీటిలో 2.5 లీటర్ల కషాయం కలిపి పిచికారీ చేస్తే పెద్ద పురుగు, గొంగళిపురుగులు నాశనమవుతాయన్నారు.ఒక డ్రమ్ములో 200 లీటర్ల నీటిని తీసుకుని దానిలో 10లీటర్ల గోమూత్రం, రెండు కేజీల ఆవు పేడ, ముద్దగా చేసిన 10 కేజీల వేపాకు, కలిపి ఉదయం సాయంత్రం సవ్యదిశలో కలిపితే 48 గంటల్లో నీమాస్త్రం తయారవు తుందన్నారు. ఈ కషాయం రసం పీల్చే పురుగు గుడ్లను, చిన్న చిన్న గొంగులి పురుగులను నాశనం చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది. కోట నిర్మల, దొరబాబు, లక్ష్మి, సన్యాశినాయుడు, లావణ్య. స్వాతి రైతులు గుమ్ముడు గోవింద, అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

త్వరితగతిన గృహ నిర్మాణాలు

ప్రజాశక్తి -కోటవురట్ల:జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, హౌసింగ్ జగదీశ్వరరావు సూచించారు.శుక్రవారం జల్లూరు గ్రామంలో హౌసింగ్ డే సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, లబ్ధిదారులకు కావలసిన నిర్మాణ సామాగ్రిని అందజేయాలని సిబ్బందికి సూచించారు. సకాలంలో బిల్లులు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని సూచించారు. లబ్ధిదారులు పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా అధికారి కరుణ, ఈఓపిఆర్డి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక సర్పంచ్ రాజీనామా

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని ఉపమాక సర్పంచ్ గొనగాల అప్పలనర్స తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం అనకాపల్లిలో డీపీవో ఆర్.శిరీషారాణికి ఆమె రాజీనామా పత్రాన్ని అందజేశారు. తనకు అనారోగ్యం కారణంగా ఆరోగ్యం సహకరించక పోవడంతో సమావేశాలకు హాజరు కాలేక పోతున్నానని, స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఆమె డిపిఓ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యులు కురందాసు నూకరాజు, ఉపమాక ,నక్కపల్లి పంచాయతీల ఉప సర్పంచ్ లు ప్రగడ వీరబాబు, వీసం రాజు పాల్గొన్నారు.

డిపిఒకు రాజీనామా పత్రాన్ని ఇస్తున్న సర్పంచ్

హెపటైటిస్‌పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-యస్.రాయవరం:ప్రపంచ హెపటైటిస్ దినోత్స వాన్ని" పురస్కరించుకొని మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి ఎస్ రాయవరం గ్రామంలో శుక్రవారంఅవగాహన ర్యాలీ చేపట్టామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ ఎస్వి శక్తి ప్రియ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హెపటైటిస్ లక్షణాలు మొదట్లో అలసట, వికారం, వాంతులు, ఆకలి లేకపోవడం, శరీరం నొప్పులు వంటివి ఉంటాయన్నారు. కొన్ని వారాల తరువాత కామెర్లు, ముదురు రంగు మూత్రం, కడుపు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ఎం రత్నసఖి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వై.అనుష, జి.కొండబాబు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ క్లస్టర్ పర్యవేక్షకులు, మలేరియా ఇంఛార్జి నోడల్ అధికారి పి.ఎన్.వి.ఎస్.ప్రసాద్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెందుర్తి : ప్రపంచ హెపటైటిస్‌డే సందర్భంగా స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు హెపటైటిస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలేజీ సెక్రటరీ టి.తియోపిలస్ మాట్లాడుతూ, వైరస్ ద్వారా సంక్రమించే హెపటైటిస్ పట్ల అవగాహన కలిగి, అప్రమత్తంగాఉండాలని సూచించారు. ఈ సందర్భంగా హెపటైటిస్‌పై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఇ ఫ్లోరా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అచ్చమ్మ, గౌతమ్‌బాబు పాల్గొన్నారు.

బహుమతులు ఇస్తున్న ఆదర్శ కాలేజీ ప్రిన్సిపల్ ఫ్లోరా